
నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
3 | మహబూబ్‌నగర్, మంగళవారం 9 ఏప్రిల్ 2024 | MAHABUBNAGAR NARAYANPET


ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లింలు

# కేసీఆర్ హయాంలో మైనార్టీలకు పెద్దపీట

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 8 : కేసీఆర్ హయాంలో మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జేజేఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్‌తో కలిసి శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ అమలుకు సాధ్యంకాని హామీలిచ్చి ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపిస్తే అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. కేసీఆర్ సర్కారులో మైనార్టీ పాఠశాలలు, గురుకుల కళాశాలల భవన నిర్మాణానికి రూ.128 కోట్లు తీసుకొచ్చి


పండ్లు తినిపిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె

అభివృద్ధి చేశామన్నారు. రూ.కోటితో హజ్ భవనం నిర్మించామని, శ్మశాన వాటికలు, దర్గాల అభివృద్ధికి ఎన్నో నిధులు కేటాయించినట్లు గుర్తుచేశారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తే పాలమూరు అభివృద్ధికి మరింత కృషి చేస్తానని వెల్లడించారు.


వెల్దండ మండలం బొల్లంపల్లిలో ఎండిన పంటలను పరిశీలిస్తున్న జైపాల్‌యాదవ్

# కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- బొల్లంపల్లిలో వరి పంటల పరిశీలన

వెల్దండ, ఏప్రిల్ 8 : ఎన్నికల్లో ఓట్ల కోసం అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి గద్దెనెక్కాక ఇచ్చిన మాట తప్పిన కాంగ్రెస్‌కు ప్రజల తగిన గుణపాఠం చెప్పక తప్పదని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. సోమవారం వెల్దండ మండలం బొల్లంపల్లిలో ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. బోర్లు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం, అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చి మోసం చేశారని మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరిట కొట్లాటలు పెట్టారని, బస్సుల్లో కెపాసిటీ సరిపోక ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నీళ్లు లేక కరువు వచ్చి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే కనీసం అండగా ఉంటామని ధైర్యం చెప్పడానికి కూడా రేవంత్ సర్కారుకు మనసు రావడం లేదన్నారు. రైతుబంధు ఇస్తానని రైతుల నోట్లో మట్టి కొట్టారని, ఎంతో మంది రైతుల ఆత్మహత్యకు కారణమవుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలిచ్చి ఒక్క హామీ కుడా నెరవేర్చలేదని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు కర్రు కాల్చి వాత పెడుతారని హెచ్చరించారు. ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపే ఉన్నారన్నారు. అనంతరం అనారోగ్యంతో మృతిచెందిన పుట్టా లక్ష్మారెడ్డికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ పుట్టారాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, చెర్కూర్ మాజీ ఉపసర్పంచ్ నర్సింహ ముదిరాజ్, మధుసూదన్‌రెడ్డి, సోమయ్య, పత్యానాయక్, చంద్రమోహన్‌రెడ్డి, తిర్మల్‌రావు, ఆనంద్ తదితరులు ఉన్నారు.

# అన్ని మతాలకూ ప్రాధాన్యమిచ్చాం : నిరంజన్‌రెడ్డి

వనపర్తి, ఏప్రిల్ 8 : కేసీఆర్ సర్కారు హయాంలో అన్ని మతాలు, పండుగలకు ప్రాధాన్యమిచ్చేవారని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం మాజీ మంత్రి నివాసంలో పేద ముస్లింలకు రంజాన్ తోఫాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత ఖర్చులతో 100 మంది పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాలను అందజేసినట్లు తెలిపారు. కేసీఆర్ హయాంలో పండుగ వేళ ఎవరూ బాధపడొద్దనే ఆలోచనతోనే ప్రత్యేక పండుగలకు కొన్ని బహుమతులను


రంజాన్ తోఫాలను అందజేస్తున్న నిరంజన్‌రెడ్డి

అందజేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలతోపాటు ప్రజలను కూడా మర్చిపోయి ప్రతిపక్షాలను బద్నాం చేసే ప్రయత్నంలోనే ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు జోహెబ్ హుస్సేన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నవ వసంతం

- జీవిత అనుభవాల సారం పచ్చడి
- ప్రకృతితో మిళితమైన పండుగ
- ఇండ్లు, ఆలయాల్లో పూజలు
- పంచాంగ శ్రవణంతో పండుగ శోభ
- తెలుగు ప్రజల కొత్త సంవత్సరం
- క్రోధి నామంగా పిలుపు

శోభకృత్ సెలవు తీసుకున్నది.. క్రోధి నామ సంవత్సరం వచ్చేస్తున్నది. మన జీవితాలు కొత్త శోభ సంతరించుకుంటాయన్న ఆశల వసంతాన్ని మోసుకొస్తున్నది. దీంతో నవ వసంతానికి స్వాగతం పలికేందుకు ఉమ్మడి జిల్లా వాసులు సిద్ధమయ్యారు. ప్రజల కొత్త సంవత్సర ఆరంభ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకొనేందుకు రెడీ అయ్యారు. ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతితో మిళితమైన పచ్చడి ఈ పండుగ ప్రత్యేకత. అలాగే సాయంత్రం పంచాంగ శ్రవణాన్ని పండితులు వినిపించనున్నారు.

*- నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ)*



తెలుగు ప్రజలకు కొత్త ఏడాది ప్రారంభాన్ని సూచించే పండుగ ఉగాది లేదా యుగాది. జనవరి ఒకటిన ఆంగ్ల సంవత్సరం ప్రారంభం మాదిరిగా తెలుగు ప్రజలు ఈ ఉగాది పండుగను జరుపుకొంటారు. వసంత మాసంలో చైత్రశుద్ధ పాఢ్యమి రోజు ఈ పండుగ వస్తుంది. ఉగ అంటే నక్షత్రం గమనం, నక్షత్ర గమానికి ఆది ఉగాది.. అంటే సృష్టి ఆరంభమైన రోజే ఉగాదిగా భావిస్తుంటారు. ఇక యుగం అనగా ద్వయం లేదా జంట అని అర్థం. ఉత్తరాయణ, దక్షిణాయన ద్వయ సంయుతం కాగా, ఆ యుగానికి ఆది యుగాదిగా మారింది. పురాణ నేపథ్యం ప్రకారం బ్రహ్మదేవుడు ఈ రోజు తెల్లవారుజామున సృష్టిని సృష్టించాడు. ఇక వేదాలను సోమకుడు అనే రాక్షసుడు తస్కరించడంతో విష్ణువు మత్స్యావతారం ధరించి సంహరించి తిరిగి బ్రహ్మదేవుడికి అప్పగించిన రోజే ఉగాది ఆచరణలోకి వచ్చిందనేది మరో నమ్మకం. అలాగే శ్రీరాముడు, విక్రమాధిత్యుడు, శాలివాహనులు ఇదే రోజు పట్టాభిషిక్తులైనట్లుగా చెబుతారు. ఈరోజు వరాహమిహిరుడు పంచాంగాన్ని జాతికి అంకితం చేశాడు. ఉగాదికి ఉన్న పేర్లు నారదుడి సంతానంగా అని కొందరంటుంటే, దక్ష ప్రజాపతి 60 మంది కుమార్తెల పేర్లని, రాజకుమారి సాందీపని సంతానంగా భావిస్తుంటారు. దీని ప్రకారం ఇప్పటి వరకు శోభకృత్ నామ సంవత్సరం కాగా బుధవారం నుంచి క్రోధి నామ సంవత్సరంగా పిలువబడుతుంది. ఈ పండుగ ప్రకృతితో సమ్మిళితమైనది. వేప పూత, మామిడికాయలు, బెల్లం, కొబ్బరి, అరటిపండ్లు, ఉప్పు, కారం లాంటి ఆరు రుచులు తెలిసేలా షడ్రుచుల సంగమంగా ఉగాది పచ్చడిని తయారు చేస్తారు. ఇక చైతన్య నవరాత్రులు కూడా ఉగాది నుంచే ప్రారంభమవుతాయి. ఈరోజు ప్రజలందరూ ఇండ్లను శుద్ధి చేసి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి దేవుళ్లను పూజిస్తారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కొత్త వస్త్రాలను ధరిస్తారు. అనంతరం తమకు ఇష్టమైన ఆలయాలకు వెళ్లి పూజలు జరుపుతారు. ఇక సాయంత్రం ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు నిర్వహిస్తారు. ఇది వింటే శుభాలు కలుగుతాయని నమ్మకం. ఇందులో రాబోయే సంవత్సరంలో వ్యవసాయం, వర్షాలు, రుతువులు, సమాజంలో, వాతావరణంలో ఎలాంటి మార్పులు వస్తాయనేది పండితులు వివరిస్తారు. అలాగే నక్షత్రాల ప్రకారం పిలుచుకునే 12 రకాల రాశులకు వచ్చే సంవత్సరం వరకు ఎలాంటి కష్టసుఖాలు కలుగుతాయి.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. ఎలాంటి పూజాధికాలు చేపట్టాలనేది పండితులు వివరిస్తారు. ఇలా ఆచార, సంప్రదాయాలకు, ప్రకృతికి నిలయమైన తెలుగు ప్రజల నూతన సంవత్సర పండుగ ఉగాదిని ఘనంగా జరుపుకొనేందుకు ప్రజలు సిద్ధమయ్యారు.

### పచ్చడి ప్రాముఖ్యత

ఉగాది పండుగ రోజు పచ్చడి కచ్చితంగా రుచి చూడాల్సిందిగా పెద్దలు చెబుతూ వస్తున్నారు. ఇది జీవితంలో షడ్రుచుల సమ్మేళనం. ఇందులో వాడే ఆరు పదార్థాలు మనుషులు ఎదుర్కొనే ఒక్కో అనుభవాలను సూచిస్తుంది. ఈ పచ్చడి ద్వారా సుఖసంతోషాలు, కష్ట సుఖాలను సమానంగా భావించాలనే సందేశాన్ని ఇస్తుంది.

**బెల్లం :** తీపి-ఆనందానికి ప్రతీక.

**ఉప్పు :** జీవితంలో ఉత్సాహం, రుచికి సంకేతం.

**వేప పూత చేదు :** జీవితంలో బాధ కలిగించే అనుభవాలకు నిదర్శనం.

**చింతపండు పులుపు :** ఎదురయ్యే సమస్యలను నేర్పుగా వ్యవహరించేలా సూచన.

**పచ్చి మామిడి ముక్కల వగరు :** కొత్త సవాళ్లను ఎదుర్కోవడం నేర్పుతాయి.

**కారం :** సహనం కోల్పోయే పరిస్థితులను సూచిస్తుంది.

# ఆరు గ్యారెంటీలతో గారడీలు

- పదేండ్ల అభివృద్ధి వంద రోజుల్లోనే మాయం
- కాంగ్రెస్ చెప్పేది కొండంత చేసేది గోరంత
- అన్నదాతల ఆవేదన ప్రభుత్వానికి పట్టదా?
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- కరువుకు కాంగ్రెస్సే కారణం : ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్
- సన్నాహక సమావేశానికి హాజరైన గువ్వల, మర్రి


మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 8 : ఆరు గ్యారెంటీలంటూ గారడీ మాటలు చెప్పి కాంగ్రెస్ కష్టాలు తీసుకొచ్చిందని, ప్రజలు మరోసారి నమ్మితే నట్టేట మునగడం ఖాయమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్‌లోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడం వల్లే సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ పార్టీలు అధికారంలో ఉన్న ఉత్తర భారతదేశం పూర్తిగా అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. ప్రాంతీయ పార్టీల మూలంగానే దక్షిణ భారతదేశం అభివృద్ధి చెందినట్లు తెలిపారు. ప్రాంతీయ పార్టీలను మట్టుబెట్టాలనే లక్ష్యంతో కాంగ్రెస్, బీజేపీ రెండూ కలిసి కుట్రలు చేస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా లేకపోతే తెలంగాణ ఆగమైతదని చెప్పారు. పదేండ్లు అభివృద్ధి చేసిన రాష్ట్రాన్ని వంద రోజుల్లోనే కాంగ్రెస్ భ్రష్టు పట్టించిందని మండిపడ్డారు. నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి గుడిపల్లి వరకు సాగునీరు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. ఇగురం లేని పాలన చేసి రైతులకు నీరందకుండా చేశారని, రైతుల పంటలు ఎండిపోవడానికి కాంగ్రెస్సే కారణమన్నారు. గతేడాది 14 శాతం వర్షపాతం ఎక్కువగా నమోదైందని, ఆ నీటిని ఎలా వాడుకోవాలో తెలియక ఈ వేసవిలో రైతుల పంటలు ఎండబెట్టారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ఎందుకు ఓటేయాలో ప్రజలు ఆలోచించాలన్నారు. కేసీఆర్ హయాంలో చేసిన అభివృద్ధే ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్‌ఎస్‌పీ గెలుపుతో నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌కు కొత్తరూపం వస్తుందన్నారు. కేసీఆర్ హయాంలో చేపట్టిన ఉద్యోగాలకు జాయినింగ్ కాగితాలను నిరుద్యోగులకు ఇచ్చి సిగ్గులేకుండా మేమే ఉద్యోగాలిచ్చామంటూ సీఎం రేవంత్ చెప్పుకోవడం నీతిమాలిన రాజకీయాలకు నిదర్శనమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రవీణ్‌కుమార్ గెలుపు ఖాయమని, కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, నాయకులు అభిలాష్‌రావు, శ్రీనివాస్‌యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన, నర్సింహ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### హామీలను తుంగలో తొక్కారు : ఆర్‌ఎస్‌పీ



అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ దొంగ హామీలిచ్చి నేడు వాటిని అమలు చేయడం చేతగాక ఊకదంపుడు ఉపన్యాసాలతో కాలం గడుపుతున్నారని బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధపు హామీలు, మ్యానిఫెస్టోను ప్రజలు మరోసారి నమ్మే పరిస్థితిలో లేరన్నారు. పార్లమెంట్ ఎన్నికలు వంద రోజుల అబద్ధాల కాంగ్రెస్, పదేండ్ల నిజమైన అభివృద్ధి పాలన అందించిన బీఆర్‌ఎస్ మధ్య జరుగుతున్నాయని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కరువు వచ్చి పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. తాను పేదరికం నుంచి వచ్చానని, పేదల అభ్యున్నతికి తనవంతు సహకారం అందించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. తెలంగాణ నినాదం, బహుజనవాదంగా పనిచేస్తానని, సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. కేసీఆర్‌కు ఇచ్చిన మాట తప్పేది లేదు, మడమ తిప్పేది లేదన్నారు. కార్యకర్తలు ప్రతి ఇంటి గడపకూ వెళ్లి కేసీఆర్ చేసిన అభివృద్ధిని గుర్తు చేస్తూ ఓటును అభ్యర్థించాలన్నారు.

### బీఆర్‌ఎస్ గెలుపునకు పాదయాత్ర చేస్తా : మర్రి



లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు కోసం అవసరమైతే పాదయాత్ర చేస్తానని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనతో దేశంలోనే తెలంగాణ నెంబర్‌వన్ గుర్తింపు పొందిందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోలేకపోవడం వల్లే ఓడిపోయామన్నారు. కందనూలు చెరువు ఎండిపోవడానికి కారణం కాంగ్రెస్ అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలేనని ఆరోపించారు. నీరు లేక మోటర్లు కాలిపోయి నెత్తిన పెట్టుకొని రిపేరుకు వస్తున్నారన్నారు. మరోసారి మోసపోకుండా పార్లమెంట్ ఎన్నికల్లో విద్యావంతుడైన ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించుకుందామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

### అక్రమ కేసులకు భయపడేది లేదు : గువ్వల



అసెంబ్లీ ఎన్నికల్లో సాధ్యం కాని హామీలిచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయమని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి భయపెట్టేందుకు చూస్తున్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు ధ్వజమెత్తారు. ఉద్యమం కోసం పుట్టుకొచ్చిన బీఆర్‌ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయదన్న సంగతి కాంగ్రెస్ గుర్తుంచుకోవాలన్నారు. కరువుతో అల్లాడుతున్న రైతులను కేసీఆర్ పరామర్శిస్తే, సీఎం రేవంత్ ఐపీఎల్ మ్యాచ్‌లు చూస్తున్నారని విమర్శించారు. అక్రమ కేసులకు భయపడొద్దని, పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు.

# మంచి మనస్సు చాటుకున్న నిరంజన్‌రెడ్డి

పెద్దమందడి, ఏప్రిల్ 8 : మండలంలోని అల్వాలలో సాగు చేసుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్న ఐదుగురు రైతులకు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఐదు జతల కోడెదూడలను అందజేసి మంచి మనసు చాటుకున్నారు. రైతులు చిన్న బాల్‌రెడ్డి, గొల్ల మొగులయ్య, గోవర్ధన్‌రెడ్డి, హరిజన్ బాలయ్య, పురుషోత్తంరెడ్డి అప్పులతో సేద్యం చేసుకోలేని పరిస్థితిలో ఉన్నారని నిరంజన్‌రెడ్డి దృష్టికి నాయకులు తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే స్పందించి కోడెదూడలను సమకూర్చారు.


నిరంజన్‌రెడ్డి అందజేసిన కోడెదూడలతో రైతులు



















